క్లుప్తంగా

వైద్యులు దైవంతో సమానం



డీఎంహెచ్‌ఓ శిరీషను సన్మానిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి వైద్యం చేసి ప్రాణాలు కాపాడే వైద్యులు దైవంతో సమానమని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జిల్లా వైద్యాధికారి శిరీషతో పాటు పలువురు మహిళా వైద్యులను సన్మానించారు. అనంతరం కొత్వాలను సన్మానించారు. కొత్వాల మాట్లాడుతూ.. కరోనా సమయంలో మహిళా వైద్యులు, సిబ్బంది ఎంతోమంది ప్రాణాలు కాపాడారన్నారు. సూపరింటిండెంట్ ముక్కంటేశ్వరరావు, వైద్యులు సోమరాజు దొర, సరళ, భాగ్యలక్ష్మి, లావణ్య, నిషి, హిమబిందు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, రాము, సత్యనారాయణ, చిరంజీవి, భరత్, చారి, యాకూబ్ పాల్గొన్నారు.

నేరాల నిర్మూలనకు సహకరించండి..



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

టేకులపల్లి: సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండి నేరాల నిర్మూలనకు సహకరించాలని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఈ మేరకు రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. సైబర్ నేరాలకు, గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజంలో ఎవరైనా ఎక్కడైనా గంజాయి రవాణా, క్రయవిక్రయాలు చేస్తున్నా, సైబర్ నేరాలకు పాల్పడుతున్నా వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి



స్టేషన్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: మూడేళ్ల క్రితం రద్దు చేసిన భద్రాచలం రోడ్ నుంచి బయలుదేరి వెళ్లే మూడు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ సభ్యులు స్టేషన్ అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. కేవలం బొగ్గు అమ్ముకొని రెవెన్యూ సంపాదించడం తప్ప, సౌత్ సెంట్రల్ రైల్వే ప్రజల గోడు పట్టించుకోవడం లేదన్నారు. రైల్వే స్టేషన్‌లో భద్రాచలం రోడ్డు నుంచి డోర్నకల్ వెళ్లే అనేకమంది ప్రయాణికులు మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నారని, ఈ ప్యాసింజర్ రైళ్లు నడిపే సమయంలో బొగ్గు రవాణా చేస్తున్నారు తప్ప ప్రజల్ని పట్టించుకోవడం లేదన్నారు. నేడు అఖిలపక్షం నాయకులు అందరూ కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఈ నెలాఖరులోపు మూడు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొదమసింహం పాండురంగాచార్యులు, విక్కి బాలరాజు, అన్నవరం సత్యనారాయణ, సలిగంటి శ్రీనివాస్, కాటంగి హరికృష్ణ, భాను, ధర్మ, బి.వీరభద్రం, కృష్ణ, రామచందర్, గుప్తా, గిరిజన నాయకులు పాల్గొన్నారు.



అన్నమాచార్య సంకీర్తనలను ఆలపిస్తున్న భక్తబృందం సభ్యులు



కోలాటం వేస్తున్న మహిళా భక్తులు

ఘనంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

- గణేష్ టెంపుల్ నుంచి శోభాయాత్ర..
- వేంకటేశ్వరుడిని కీర్తిస్తే సకల శుభములు: శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి



శ్రీవేంకటేశ్వర కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కొత్తగూడెంటౌన్: ఏడుకొండల స్వామి వేంకటేశ్వరుడి కరుణాకటాక్షం అందరిపై ఉంటుందని స్వామి వారి కల్యాణాన్ని తిలకించిన భక్తులకు పుణ్యఫలం లభిస్తుందని, అంగరంగ వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం జరిపించడం నా అదృష్టం అని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో భక్తగ్రేసర బృందం వికాస తరంగిని సభ్యులు కార్య నిర్వాహకులు డాక్టర్ వి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంకాలం కొత్తగూడెం గణేష్‌టెంపుల్ ఆలయం నుంచి పోస్టాఫీస్ సెంటర్‌లోని ప్రకాశం స్టేడియం వరకు స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కోలాటాల బృందాలు శ్రీవేంకటేశ్వరుడి నామస్మరణతో సంకీర్తనలతో ప్రాంగణం మార్మోగింది. అనంతరం అన్నమాచార్యుని కీర్తనలను భక్త బృందం ఆలపించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, పుష్పయాగంను వేదమంత్రోచ్ఛరణల మధ్య చినజీయర్ స్వామి సమక్షంలో నిర్వహించారు. అనంతరం చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. భక్తులకు శ్రీవేంకటేశ్వరస్వామి మహిమలను వివరించారు. కోరిన కోరికలను తీర్చేవాడు, భక్తులకు కొండంత అండగా ఉంటాడన్నారు. శ్రీవారి కల్యాణం విశిష్టతను వివరించారు. ప్రకాశం స్టేడియం అంతా ఓం నమో వేంకటేశాయా.. నామస్మరణలతో మార్మోగింది. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో పాటు పలువురు అతిథులు హాజరయ్యారు.

భక్తులకు చినజీయర్ స్వామి ఆశీస్సులు

పాల్వంచ: పట్టణంలో భక్తులకు చినజీయర్ స్వామి ఆశీస్సులు అందించారు. శనివారం భద్రాచలం నుంచి కొత్తగూడేనికి వెళుతూ కాంట్రాక్టర్స్ కాలనీలోని వికాస తరంగిణి సొసైటీ అధ్యక్షురాలు రోజారాణి స్వగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉపదేశాలు చేసి, ఆశీస్సులు అందించారు. గోదవర్తి సంపత్ కుమార్ అప్పలాచార్యులు, వేణుగోపాలాచార్యులు, పండు ఆచార్యులు, డిష్ ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.



ఊరేగింపును ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామి



కల్యాణం తిలకిస్తున్న భక్తులు



భక్తులతో మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

స్వయం ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభం



తరగతులను ప్రారంభిస్తున్న మధురవాణి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సేవా ద్వారా అందిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు జి.మధురవాణి షాలేంరాజు అన్నారు. శనివారం ఏరియాలోని రుద్రంపూర్‌లోని సీఈఏ క్లబ్‌లో రుద్రంపూర్, గౌతంపూర్, రామవరం నిరుద్యోగ మహిళలు, గృహిణుల కోసం ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా సేవా సభ్యులకు, పరిసర ప్రాంత మహిళలకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో బి.భవాని రవీందర్, పర్సనల్ మేనేజర్ బి.శివకేశవరావు, సీనియర్ పీఓ సంఘమిత్ర, సేవా కోఆర్డినేటర్ సాగర్, సేవా సెక్రటరీ అనిత, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీ పెద్దతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు శనివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పడమటనర్సాపురం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో పని చేసి బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు పలకగా, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. బదిలీ అయిన పడమటనర్సాపురం కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్.దుర్గాప్రసాద్, మండల నోడల్ ఆఫీసర్ బి.బాలాజీ, పాపకొల్లు హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈఓ గుగులోత్ వెంకట్, ఉపాధ్యాయుడు నాగేశ్వరరావులకు పూలమాలలు వేసి మెమెంటోలు అందించి, శాలువాలు కప్పి సన్మానించారు. బదిలీపై ఇక్కడకు వచ్చిన పడమటనర్సాపురం కాంప్లెక్స్ హెచ్‌ఎం బి.జుంకీలాల్, కాకర్ల హెచ్‌ఎం సంజీవరావు, ఏజీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సుభద్రమ్మ, ఉపాధ్యాయురాలు బి.విజయలకు స్వాగతం పలికి సన్మానించారు.

మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్ షెడ్యూల్ విడుదల

ఇల్లెందు: సింగరేణిలోని అన్ని శాఖల పనితీరుతో పాటు సంస్థ పురోగతిలో ఆయా శాఖలు, ఉద్యోగుల పాత్రను వివరించేందుకు మల్టీ డిపార్టమెంటల్ టీమ్ షెడ్యూల్ విడుదల చేశారు. శనివారం జీఎం జాన్ ఆనంద్ తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సోమవారం జేకే ఓసీలో మూడు షిఫ్టులలో పనిచేసే ఉద్యోగులకు మూడు సమయాల్లో మీటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏరియా ఆస్పత్రి ఉద్యోగులకు, కేఓసీ ఉద్యోగులకు, ఏరియా వర్క్‌షాప్ ఉద్యోగులకు సీహెచ్‌పీ ఉద్యోగులకు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు, సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

పాల్వంచరూరల్: పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉందని తహసీల్దార్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 2,447 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు.

ఎంపీ టికెట్ కోసం పలువురి దరఖాస్తు

కొత్తగూడెంరూరల్: రానున్న లోక్‌సభ ఎన్నికలో ఖమ్మం పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు టీపీసీసీ సభ్యుడు నాగసీతారాములు, మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేసేందుకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ శంకర్ నాయక్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శనివారం దరఖాస్తు చేసుకున్నారు.

టేకులపల్లి: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టేకులపల్లి మండలానికి చెందిన భూక్యా దళ్‌సింగ్ నాయక్, దాసుతండా పంచాయతీ లచ్చతండాకు చెందిన భూక్యా చందర్‌సింగ్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీ టికెట్ తమకు కేటాయించాలని కోరుతూ ఇల్లెందు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు. శనివారం కాంగ్రెస్ నేతలు భూక్యా దళ్‌సింగ్ నాయక్, చీమల వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.రవి హైదరాబాద్‌లో దరఖాస్తు పత్రాలు అందజేశారు.

విద్యార్థుల ప్రతిభ

ఇల్లెందు: చెకుముకి టాలెంట్ టెస్టులో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు శనివారం పాఠశాల చైర్మన్ జోష్ తెలిపారు.

టేకులపల్లి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు సత్తా చాటారు. ఈ మేరకు శనివారం హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, గైడ్ టీచర్ మోహన్‌రావు వివరాలు వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు.

బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

ఇల్లెందురూరల్: చల్లసముద్రం గ్రామపంచాయతీకి చెందిన బీఆర్‌ఎస్ నేత పెరుమాళ్ల కృష్ణయ్య గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. రైతు సమన్వయ సమితి కన్వీనర్‌గా ఆయన సుదీర్ఘకాలం సేవలందించారు. కృష్ణయ్య మృతి పట్ల బీఆర్‌ఎస్ మండల, అధ్యక్ష, కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక సంతాపం వ్యక్తం చేశారు.

స్వాతంత్య్ర సమరయోధుడు..

టేకులపల్లి: ఎ కాలనీ తండాకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు భూక్యా భీల్యానాయక్(110) శనివారం మృతి చెందారు. భార్య కొన్నేళ్ల క్రితమే మృతి చెందింది. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గ్రామపంచాయతీ పాలకవర్గాలకు సన్మానం

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ఐదేళ్ల పదవీ కాలం ముగిసింది. ఈ మేరకు శనివారం సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. చింతలతండా, కాకర్ల, భేతాళపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తుల ఆధ్వర్యంలో పాలకవర్గాలను సన్మానించారు.

పాల్వంచరూరల్: ప్రజాప్రతినిధులు తమ పదవీకాలంలో ప్రజలకు చేసిన సేవలే ముఖ్యమని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివారావు అన్నారు. నాగారం గ్రామంలో శనివారం ఇటీవల పదవీకాలం ముగిసిన పంచాయతీ పాలకవర్గం సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొత్వాల హాజరయ్యారు. సర్పంచ్ బానోతు రాజా, ఉపసర్పంచ్ చందులతోపాటు పాలకవర్గ సభ్యులను సన్మానించి మాట్లాడారు.



పాల్వంచరూరల్: మాట్లాడుతున్న కొత్వాల

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్, పోలారం గ్రామపంచాయతీల పాలకవర్గాలను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పాలకవర్గం, సిబ్బందిని సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు, ఎంపీటీసీ శీలం ఉమ శాలువాలతో సత్కరించారు.

పోలారం గ్రామపంచాయతీలో ఉపాధ్యాయులు ప్రస్తుత సర్పంచ్, పాలకవర్గంతోపాటు గతంలో సర్పంచ్‌లుగా బాధ్యతలు చేపట్టిన నేతలను సైతం ఘనంగా సన్మానించారు.



జూలూరుపాడు: చింతలతండా సర్పంచ్ రాములును సన్మానిస్తున్న కార్యదర్శులు



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పాలకవర్గం



పోలారం సర్పంచ్ సరోజినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

మొబైల్ కోర్టును కొనసాగించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలంలో మొబైల్ కోర్టును నిర్వహించవద్దని భద్రాచలం ప్రాజెక్టు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ ప్రసాదరావు, రమేష్‌కుమార్ మక్కడ్ కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఎలాంటి అధికార పరిధి లేకుండా ఐటీడీఓ పీఓ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వులు ఏజెన్సీ, షెడ్యూల్డ్ ఏరియాలో న్యాయ ప్రక్రియను అనసరంగా నిలిపి వేసిందని, కాబట్టి అలాంటి ఉత్తర్వులను వెంటనే ఉపసంసరించుకోవాలని కోరారు. ప్రస్తుతం ఉన్న సబ్ కలెక్టర్ లేదా రెవెన్యూ డివిజనల్ అధికారుల న్యాయ నిర్ణయ అధికార పరిధిని తప్పించి జీఓ 406 ప్రకారం భద్రాచలం వద్ద మొబైల్ కోర్టును ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. ప్రస్తుతం మొబైల్ కోర్టు సివిల్ వ్యాజ్యాలను ఏజెన్సీ రూల్స్ 1924 ప్రకారం పరిష్కరిస్తోందని, కానీ ఆకోర్టులో కనీస సిబ్బందిని కేటాయించలేదని, తగినంత బడ్జెట్ లేదని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల కారణంగా మొబైల్ కోర్టులో సివిల్ జస్టిస్ అడ్మినిస్ట్రేషన్‌కు ఆటంకం ఏర్పడుతుందని, మారుమూల ప్రాంతాలలో నివసించే ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యం దూరం అవుతుందన్నారు. జిల్లా, మండలాల విభజనతో భూముల విలువలు పెరగడం వల్ల సివిల్ వ్యాజ్యాలు భారీగా పెరిగాయని, ఇలాంటి స్థితిలో మొబైల్ కోర్టును నిలిపివేయడం సమంజసం కాదన్నారు. వంద సంవత్సరాల క్రితం నిర్ణయించిన ఏజెన్సీ కోర్టు ఆర్థిక అధికార పరిధిని సివిల్ కోర్టులతో సమానంగా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయ ప్రక్రియలో శిక్షణ పొందిన వారిని మొబైల్ కోర్టు జడ్జీలుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలోనే పాఠశాలల్లో వార్షిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

ఇల్లెందురూరల్: ఈ ఏడాది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో త్వరలో వార్షిక తనిఖీలు నిర్వహిస్తామని ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ప్రధానోపాధ్యాయుల సమావేశం శనివారం సుభాష్‌నగర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాల హెచ్‌ఎం వార్షిక నివేదికను వెంటనే సిద్ధం చేసుకోవాలని సూచించారు. నెలవారీ నివేదికలను సకాలంలో అందించాలని చెప్పారు. 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రతిభ పరీక్షలను పాఠశాల, కాంప్లెక్స్, మండల స్థాయిలలో నిర్వహిస్తామని చెప్పారు. ఆన్‌లైన్‌లో నివేదికలను సకాలంలో నమోదు చేయాలని పేర్కొన్నారు. పాఠశాల విద్యా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఆదేశించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు స్వామి, యాదమ్మ, ఉమాశంకర్, రాంబాబు, సుధాకర్, శర్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధి కన్నా భయమే ప్రమాదం



మాట్లాడుతున్న భానుమతి

కొత్తగూడెంరూరల్: కేన్సర్ వ్యాధిపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేన్సర్‌ను సకాలంలో గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రపంచంలో అత్యధిక మరణాలు కేన్సర్ వలన వస్తున్నాయన్నారు. అనంతరం కొత్తగూడెంలోని జనరల్ ఆస్పత్రి ప్రైవేట్ కేర్ వైద్యురాలు డాక్టర్ జె.రూప కేన్సర్ రోగం కన్నా భయమే ప్రమాదమన్నారు. ప్రాథమిక దశలో రొమ్ము, గర్భాశయ, గొంతు కేన్సర్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, చీఫ్ లీగల్ ఎయిడ్స్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, ఎస్‌ఐ సంతోష్, ప్రిన్సిపాల్ కె.హవీలా, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, అసిస్టెంట్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగస్రవంతి, న్యాయవాదులు రాజమల్లు, అధ్యాపకులు వెంకట్, శ్రీదేవి, మాధవి, సుస్మిత, రజని, కృష్ణవేణి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు



కనకగిరి రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లో పరిశీలిస్తున్న కొత్తగూడెం ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు



అటవీ ప్రాంతాన్ని సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

జూలూరుపాడు: అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్(ఎఫ్‌డీఓ) యు.కోటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని కనకగిరి రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌ను సందర్శించారు. అటవీ సంపద, అటవీ జాతులు, వన్యప్రాణుల సంచారాన్ని పరిశీలించారు. మారు జాతి మొక్కల ప్లాంటేషన్‌ను తనిఖీ చేశారు. రానున్న వేసవి కాలంలో అడవులు అగ్ని ప్రమాదాల బారినపడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని అటవీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, డీఆర్‌ఓలు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు, ఎఫ్ఎస్ఓ మల్లయ్య, ఎఫ్‌బీఓలు బి.నరసింహారావు, చింతా వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, కిషన్, శ్రీలత, ఎస్కే రహీమ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల వన సందర్శన..

జూలూరుపాడు అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం వనదర్శిని కార్యక్రమంలో భాగంగా స్థానిక సెయింట్ ఆంటోనియస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు వనాన్ని సందర్శించారు. పాపకొల్లు అటవీ ప్రాంతంలోని సహజ అడవులు, వృక్షజాతులు, నీటికుంటలు, చెక్‌డ్యామ్‌లు, అటవీ ప్లాంటేషన్, గడ్డి మైదానాలు, అటవీ జంతువుల సంచారాన్ని అటవీశాఖ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ఆర్తి, టీచర్లు అనసూర్య, లక్ష్మీసరస్వతి, కృష్ణ, సిస్టర్స్ ఆల్‌ఫన్సా, మెరీనా, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికైనా శివుడి దర్శమయ్యేనా?



పెద్దమ్మగుడి వద్ద నిర్మాణంలో ఉన్న శివాలయం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య పెద్దమ్మతల్లి ఆలయ సమూదాయంలో శివాలయ నిర్మాణం పనులు చేపట్టి ఏడాదిన్నర. నేటికీ పనులు పూర్తికాలేదు. రూ.30లక్షలు దాతల సహకారం, 44 ఆలయ నిధులు మొత్తం రూ.74 లక్షల వ్యయం చేసి 2021 అక్టోబర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు గుడి నిర్మాణ పనులు మాత్రమే పూర్తి చేశారు. పనులు పూర్తికాక ముందే కార్తీకమాసంలో ఆలయాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. కానీ మంచి మూహుర్తం లేకపోవడంతో ప్రారంభించలేదు. ఇంకా ఆలయంలో ఫ్లోరింగ్, ప్లాస్టింగ్, గ్రానైట్, విద్యుత్, రంగులు వేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. ముఖద్వారంలో స్వామివారి చిత్రాలు ఏర్పాటు పనులు చేయాల్సి ఉంది. విద్యుత్ పనులు మిగిలి ఉన్నాయి.

శివాలయం పూర్తయితే భక్తులకు సౌకర్యం...

మండలంలో శివాలయం లేక శివభక్తులంతా కార్తీకమాసం, శివరాత్రికి పట్టణంలో ఉన్న శివాలయాలకు వెళ్లి ఇబ్బందులు పడుతూ పూజలు చేసుకుంటున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో పెద్దమ్మగుడిలో నిర్మించనున్న శివాలయ నిర్మాణం పూర్తయితే మండలంలోని భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

నెలరోజుల్లో పూర్తి చేస్తాం..



పెద్దమ్మగుడి వద్ద శివాలయం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గణపతి, శివపార్వతుల విగ్రహాలను మహాబలిపురం నుంచి తీసుకొస్తున్నాం. ఆలయ శిఖరంలో పనులు తుదిదశకు వచ్చాయి. త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ఈ నెల చివరి నాటికి ఆలయాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.రజనీకుమారి, ఈఓ, పెద్దమ్మగుడి